క్లుప్తంగా

సన్మానం



బచ్చన్నపేట: మండల కేంద్రానికి చెందిన గుర్రపు బాలరాజు తెలంగాణ రాష్ట్ర పద్మశాలి సంఘం సంయుక్త కార్యదర్శిగా ఎన్నియ్యారు. కాగా, పలువురు కాంగ్రెస్ మండల నాయకులు ఆయనను శుక్రవారం మండల కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో శాలువాలతో సన్మానించారు. సూత్రమే రమేశ్, దిడ్డిగ రమేశ్, దేవరకొండ రమేశ్, జంగిడి సిద్దులు, అవదూత శ్రీనివాస్, కృష్ణమూర్తి, వెంకటేష్ ఉన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు..



దేవరుప్పుల: మానవుడి జీవితం పయనం సజావుగా కొనసాగేందుకు అత్యంత దోహదపడే విద్యాభివృద్ధిలో ఓనమాలు నేర్పే ప్రాథమిక బడుల ఉపాధ్యాయులను చిన్నారులు మరువరని ఎంఈఓ జి.కళావతి అన్నారు. శుక్రవారం మండలంలోని మాధాపురం ప్రాథమిక పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఆర్.మనోహర్, గోలి తిరుపతిరెడ్డిలను హెచ్‌ఎం అధ్యక్షతన ఆమె ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు రూ.8 వేల విలువైన ప్రత్యేక దుస్తులను విద్యార్థులకు పంపిణీ చేశారు.

'రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలి'

జఫర్‌గఢ్: రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి సాయన్న డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో పార్టీ సమావేశాన్ని ఎండీ యాకుబ్‌పాష అధ్యక్షతన శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రూ. రెండు లక్షల రుణమాఫీ చేయాలన్నారు. అదే విధంగా యాసంగి రుణాలు వెంటనే ఇవ్వాలన్నారు. రైతు భరోసా కింద ఎకరాకు రూ.7 వేలు ఖాతాలో జమచేసి రైతులను ఆదుకోవాలన్నారు. ఎండీ జాఫర్, బుచ్చయ్య, చంద్రమౌళి, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలకు టీవీ బహూకరణ



బచ్చన్నపేట: మండలంలోని వంగ సుదర్శన్ రెడ్డి నగర్ గ్రామ పాఠశాలకు ప్రముఖ వ్యాపారవేత్త దాస నర్సయ్యగుప్త 40 ఇంచుల ఎల్‌ఈడీ టీవీని బహూకరించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ కుమారుడు అరుణ్‌తేజ పుట్టినరోజు సందర్భంగా టీవీని అందించానని, ప్రతీ సంవత్సరం ఓ బహుమతిని అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం చంద్రశేఖర్, పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్, దీపారాణి, రమేష్, ఉపాధ్యాయులు రవీందర్‌రెడ్డి, హజీరా, రాజేందర్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి పాఠశాల గోల్డెన్ జూబ్లీ వేడుకలు

జఫర్‌గఢ్: ఈ నెల 21, 22 తేదీల్లో నిర్వహించనున్న గోల్డెన్ జూబ్లీ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు మండలంలోని కూనూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సిద్ధం చేశారు. 50 సంవత్సరాలుగా చదువుకున్న 4 వేల మంది పూర్వవిద్యార్థులు గోల్డెన్ జూబ్లీ వేడుకల ద్వారా పాఠశాల వేదికగా కలుసుకోనున్నారు. మొదటి రోజు(శనివారం) ఉదయం 10 గంటలకు వేడుకలు ప్రారంభం కానున్నాయి. ఈ వేడుకలకు ముఖ్యఅతిథిలుగా ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా, సీపీ అంబర్ కిషోర్‌ఝాతో పాటు తదితరులు హాజరు కానున్నారని కమిటీ సభ్యులు తెలిపారు.

'అమిత్ షా క్షమాపణ చెప్పాలి'

కొడకండ్ల/స్టేషన్‌ఘన్‌పూర్: రాజ్యాంగ నిర్మాత డాక్టర్ అంబేడ్కర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన కేంద్ర మంత్రి అమిత్ షా భేషరతుగా క్షమాపణ చెప్పాలని మాల మహానాడు మండల అధ్యక్షుడు జవ్వాజి ప్రవీణ్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామ–సూర్యాపేట రహదారిపై గిర్నితండా వద్ద మాల మహానాడు ఆధ్వర్యంలో అమిత్ షా దిష్టిబొమ్మను దహనం చేశారు. అలాగే అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మాదిగల ఐక్య సంక్షేమ సంఘం, రాజ్యాంగ పరిరక్షణ కమిటీ, దళిత, బహుజన సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం స్టేషన్ ఘన్‌పూర్ బస్టాండ్ సమీపాన అంబేడ్కర్‌సెంటర్ వద్ద నిరసన చేపట్టారు. అలాగే రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్‌ను అవమానపరిచేలా మాట్లాడిన అమిత్ షాకు కేంద్రమంత్రిగా కొనసాగే అర్హత ఎంతమాత్రం లేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు ఎండీ.అబ్బాస్ అన్నారు. ఘన్‌పూర్ డివిజన్‌కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు.

అయోమయంలో అన్నదాతలు

- నాట్లు వేయాలా వద్దా అనే సందిగ్ధంలో చెరువు శిఖం రైతులు
- గోదావరి జలాలతో చెరువులు నిండేనా..?

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల్లోని చెరువు శిఖం పట్టా రైతులు నాట్లు వేయాలా వద్దా అనే సందిగ్ధంలో పడ్డారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి యాసంగిలో గోదావరి జలాలతో మండలంలోని చెరువులన్నీ నింపుతామని అనేకసార్లు హామీ ఇచ్చి ఆ మేరకు నేడు కార్యచరణ మొదలు పెట్టారు. అందులో భాగంగా అశ్వరావుపల్లి రిజర్వాయర్ ప్రధాన కాల్వలో పూడికతీత పనులు గత పదిహేను రోజులుగా జరుగుతున్నాయి. అంతేకాకుండా అక్కడక్కడా మిగిలిన భూ సేకరణ కూడా పూర్తి చేసి పనులు చేపట్టారు. దీంతో మండలంలోని లింగాలఘణపురం, బండ్లగూడెం, కళ్లెం, గుమ్మడవెల్లి, సిరిపురం, జీడికల్, పటేల్‌గూడెం, నవాబుపేట గ్రామాల్లోని చెరువులు, కుంటలు నిండనున్నాయి. ఆయకట్టు రైతులతో పాటు, ఇతర రైతులు కూడా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో ఆయా గ్రామాల చెరువులు, కుంట శిఖలాలో పట్టా భూములు కలిగిన రైతులు మాత్రం యాసంగిలో నాట్లు వేసేందుకు కొంత మంది పొలాలు దున్ని సిద్ధం చేస్తున్నారు. మరికొంత మంది ఇప్పటికే నాట్లు కూడా వేశారు. ఒకవేళ గోదావరి జలాలు వస్తే చెరువులు, కుంటలు నిండి వేసిన నాట్లు మునిగిపోయి పెట్టుబడులు నష్టపోయే ప్రమాదం ఉంటుందని నాట్లు వేసిన రైతులు ఆలోచనలో పడగా వేయని రైతులు వేయాలా..? వద్దా..? వానాకాలంలోనే నాట్లు వేసుకోలేకపోయామని, యాసంగిలోనైనా వేద్దామంటే గోదావరి జలాలు వస్తాయని అంటున్నారంటూ గందరగోళంలో పడ్డారు. ఇదిలా ఉండగా నీటిపారుదల శాఖ అధికారులు సహితం కాల్వ మరమ్మతు పనులను ముమ్మరం చేస్తున్నారు.



కళ్లెం చెరువు శిఖంలో నాట్లు వేసిన పొలం



జీడికల్ చెరువు శిఖంలో నాట్లు వేసేందుకు దున్ని సిద్ధంగా ఉన్న పొలం

పది ఎకరాల వరకు దున్ని సిద్ధం చేశా..



జీడికల్ చెరువు శిఖం పరిధిలో పట్టా భూమిలో పది ఎకరాలు నాట్లు వేసేందుకు పొలం దున్ని సిద్ధం చేశా. చెరువులకు గోదావరి నీళ్లు వస్తాయని అంటున్నారు. వస్తాయో రావో.. ? ఏం చేయాలో తోచడంలేదు.

- కొండబోయిన అంజనేయులు, రైతు, జీడికల్

ఐదు ఎకరాల్లో నాట్లు వేశా..



ఇప్పటికే ఐదు ఎకరాల్లో నాట్లు వేశా.. వానాకాలంలో నీళ్లు ఉండడంతో అప్పుడు వేయలేదు. ఏడాదికి ఒకసారే యాసంగిలో నాట్లు వేస్తాం.. ఇప్పుడు వేసి 15 రోజులైంది. నీళ్లు వస్తాయని అంటున్నారు. వస్తే మునిగిపోయి పెట్టుబడి నష్టపోవడం తప్పదు.

- నకీర్త మహేశ్, రైతు, కళ్లెం

కాల్వ మరమ్మతు పనులు చేస్తున్నాం..

అశ్వరావుపల్లి ప్రధాన కాల్వకు సంబంధించి మరమ్మతు పనులు చేస్తున్నాం. త్వరలో చెరువుల్లోకి నీళ్లు వస్తాయి. జీడికల్ వరకు వెళ్లే కాల్వలో పిట్టలోనిగూడెం వద్ద 400 మీటర్లు ఇంకా కాల్వ తీయాల్సి ఉంది. అది పూర్తయితే జీడికల్ వరకు కూడా గోదావరి జలాలు చేరుతాయి.

- రవికుమార్, డీఈ, నీటిపారుదల శాఖ

సృజనాత్మకతను వెలికితీయాలి



విద్యార్థులు వేసిన చిత్రాలను పరిశీలిస్తున్న ఎంఈఓ

నర్మెట: చదువుతోపాటు విద్యార్థులు అన్నిరంగాల్లో రాణించేలా ఉపాధ్యాయులు కృషి చేయడంతోపాటు వారిలోని సృజనాత్మకతను వెలికి తీయాలని ఎంఈఓ బలయ్య అన్నారు. మాన్‌సింగ్‌తండా పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన చిత్రలేఖనంలో విద్యార్థుల ప్రతిభను అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను ప్రతిభావంతులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులదే కీలకపాత్రగా భావించాలని సూచించారు. ఉపాధ్యాయులు పగిడిపాటి దామోదర్, రావుల రాంమ్మోహన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో తల్లీకుమారుడు మృతి

- బైక్‌ను ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి ఢీకొట్టిన కారు
- యాదాద్రి భువనగిరి జిల్లాలో ఘటన

యాదగిరిగుట్ట రూరల్: కారు ఢీ కొట్టడంతో తల్లీకొడుకు మృతి చెందిన సంఘటన యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలంలోని హైదరాబాద్– వరంగల్ ప్రధాన జాతీయ రహదారిపై శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. మాదిరెడ్డి సంధ్య అలియాస్ శాంతి(35) ఆమె కుమారుడు మాదిరెడ్డి క్రాంతి (15) జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన వీరు కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌లోని ఈసీఐఎల్ సమీపంలోని దమ్మాయిగూడకు వలస వెళ్లి స్థిరపడ్డారు. శాంతి భర్త ప్రతాప్‌రెడ్డి ఆరు నెలల క్రితం అనారోగ్యంతో మృతిచెందాడు. సంధ్య తన కుమారుడు, అదే ప్రాంతానికి చెందిన మరొక వ్యక్తి రాజుతో కలిసి శుక్రవారం హైదరాబాద్ నుంచి యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామానికి స్కూటీపై వ్యక్తిగత పని నిమిత్తం వచ్చారు. పనులు ముగించుకుని సాయంత్రం సమయంలో తిరిగి హైదరాబాద్‌కు బయలుదేరారు. ఈక్రమంలో యాదగిరిగుట్ట మండలం తాళ్లగూడెం స్టేజీ సమీపానికి రాగానే, అదే రూట్లో వెళ్తున్న కారు, ద్విచక్ర వాహనాన్ని ఓవర్ టేక్ చేస్తూ వెనుక నుంచి స్కూటీని ఢీ కొట్టింది. దీంతో స్కూటీపై ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు ఎగిరి కింద పడిపోయారు. దీంతో సంధ్య, ఆమె కుమారుడు క్రాంతికి బలమైన గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ద్విచక్ర వాహనాన్ని నడుపుతున్న రాజుకు తీవ్ర గాయాలు కాగా, ఆలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు యాదగిరిగుట్ట సీఐ రమేష్ తెలిపారు. కాగా మృతులు జనగామ మండలం ఎర్రగొల్లపహాడ్‌కు చెందిన వీరు కొన్ని సంవత్సరాల క్రితం హైదరాబాద్‌కు వలస వెళ్లారు.




మృతులు సంధ్య, క్రాంతి

ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలి



లింగాలఘణపురం: దుప్పట్లతో విద్యార్థులు

- ఎంపీడీఓ శ్రీనివాసులు

రఘునాథపల్లి: విద్యార్థినులు ఉన్నత లక్ష్యాలను ఎంచుకోవాలని ఎంపీడీఓ గార్లపాటి శ్రీనివాసులు సూచించారు. శుక్రవారం మండలంలోని ఖిలాషాపూర్ కస్తూర్బా గాంధీ బాలిక విద్యాలయంలోని విద్యార్థినులకు ఆయన దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థినులకు కొత్త మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం అందించాల సిబ్బందికి ఆయన సూచించారు.

విద్యార్థినులకు బ్లాంకెట్ల పంపిణీ

కొడకండ్ల: చలి తీవ్రతను దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం సరఫరా చేసిన బ్లాంకెట్లను మండలకేంద్రంలోని కస్తూర్బా విద్యార్థినులకు ఎంపీడీఓ నాగశేషాద్రిసూరి, ఎంఈఓ గ్రేస్‌ఖజీయారాణి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎనలేని చేయూతనందిస్తూ, విద్యాభ్యున్నతే లక్ష్యంగా సకల సదుపాయాలు కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకుంటూ విద్యలో రాణించాలని వారు కోరారు.

లింగాలఘణపురంలో..

లింగాలఘణపురం: మండలంలోని కస్తూర్బాగాంధీ విద్యాలయంలో విద్యార్థులకు ప్రభుత్వం నుంచి సమగ్ర శిక్ష కార్యక్రమంలో భాగంగా వచ్చిన దుప్పట్లను ఎంఈఓ విష్ణుమూర్తి, ఎంపీడీఓ జలేందర్‌రెడ్డి పంపిణీ చేశారు. కార్యక్రమంలో స్పెషల్ ఆఫీసర్ అన్నపూర్ణ, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

మహిళా సంఘం భవనానికి మరమ్మతులు



జగదీష్‌చందర్‌రెడ్డిని సత్కరిస్తున్న ప్రతినిధులు

రఘునాథపల్లి: మండలంలోని ఇబ్రహీంపూర్‌లో శిథిలమవుతున్న మహిళా సంఘం భవనానికి మరమ్మతులు చేస్తామని జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ లింగాల జగదీష్‌చందర్‌రెడ్డి అన్నారు. స్వగ్రామానికి చెందిన వైష్ణవి, గాయత్రి గ్రామైఖ్య సంఘాల ఆహ్వానం మేరకు శుక్రవారం మహిళా భవనంలో ఆయన మహిళలతో సమావేశమయ్యారు. భవనం మరమ్మతులతో పాటు ప్రహరి నిర్మించాలని గ్రామైఖ్య సంఘాల ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. అలాగే రజక కులస్తులు రజక భవనం మంజూరు చేయాలని విన్నవించారు. ఎమ్మెల్యే కడియం శ్రీహరి, ఎంపీ కడియం కావ్య దృష్టికి ఇబ్రహీంపూర్ ప్రధాన సమస్యలు తీసుకెళ్లి నిధుల మంజూరికి కృషి చేస్తామని జగదీష్‌చందర్ రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జగదీష్‌చందర్ రెడ్డిని మహిళా సంఘాలు శాలువాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వీఓల అధ్యక్షులు అంబీరు అరుణ, పబ్బ నాగలక్ష్మి, వీఓఏలు నల్ల మౌనిక, నూనె వరలక్ష్మి, మాజీ అధ్యక్షురాలు గాజులపాటి విజయ, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు పోకల శ్రీనివాస్, ఎండీ యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

ఘన్‌పూర్ మోడల్‌కాలనీలో కార్డన్‌సెర్చ్



స్వాధీనం చేసుకున్న వాహనాలతో ఏసీపీ, సీఐ

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్ మోడల్‌కాలనీలో శుక్రవారం రాత్రి ఏసీపీ భీమ్‌శర్మ, సీఐ జి.వేణు ఆధ్వర్యంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా, సరైన పత్రాలు లేని 23 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా 4.9 లీటర్ల లిక్కర్, రూ.500 విలువైన గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. సీఐ జి.వేణు, ఎస్‌ఐలు వినయ్‌కుమార్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

రైతుకు అవార్డు



రఘునాథపల్లి: మండలంలోని కన్నాయిపల్లికి గ్రామానికి చెందిన మంతపురం యాదగిరి శుక్రవారం హైదరాబాద్‌లో బెస్ట్ ప్రోగ్రెస్ ఫార్మర్ అవార్డును అందుకున్నాడు.

నిబద్ధతతో విధులు నిర్వర్తించాలి

- ఏసీపీ పార్థసారథి

జనగామ రూరల్: పోలీసు సిబ్బంది నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని ఏసీపీ పార్థసారథి అన్నారు. వార్షిక తనిఖీలో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగుల వివరాలు, రికార్డులు పరిశీలించారు. పాత,కొత్త కేసులు తెలుసుకుని త్వరగా పరిష్కరించాలని సూచించారు. సీఐ దామోదర్‌రెడ్డి ఎస్సైలు పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు పాటుపడాలి

దేవరుప్పుల: శాంతి భద్రతల పరిరక్షణకు పోలీసు సిబ్బంది పాటుపడాలని వర్ధన్నపేట ఏసీపీ అంబటి నర్సయ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌ను వార్షిక తనిఖీలో భాగంగా రికార్డులు పరిశీలించి పలు మార్గదర్శకాలు సూచించారు. సీఐ మహేందర్‌రెడ్డి, ఎస్సై సృజన్‌కుమార్, ఏఎస్సై సదానందం, కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.



సామగ్రి పరిశీలిస్తున్న ఏసీపీ పార్థసారథి

కాంగ్రెస్ నాయకుల సంబురాలు

స్టేషన్‌ఘన్‌పూర్: డివిజన్ కేంద్రమైన స్టేషన్‌ఘన్‌పూర్‌ను మున్సిపాలిటీగా అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేస్తూ డివిజన్‌కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబురాలు చేసుకున్నారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట బాణాసంచాలు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం ర్యాలీ చేపట్టారు. బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీహెచ్.నరేందర్‌రెడ్డి, జూలుకుంట్ల శిరీష్‌రెడ్డి, బెలిదె వెంకన్న, నీల గట్టయ్య, బూర్ల శంకర్, పోగుల సారంగపాణి తదితరులు పాల్గొన్నారు. కాగా, అసెంబ్లీలో ఘన్‌పూర్ మున్సిపాలిటీపై ప్రకటన చేయడంపై సీఎం రేవంత్‌రెడ్డికి స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



సంబురాల్లో కాంగ్రెస్ నాయకులు

శాంతి సమాజం కోసం యేసు జననం



వేడుకల్లో ఫాదర్ థామస్, విద్యార్థులు

దేవరుప్పుల: శాంతి సమాజం కోసం యేసు జన్మించారని విద్యా జ్యోతి డిగ్రీ కాలేజ్, ఫాదర్ కొలంబో సీబీఎస్ఈ స్కూల్ సెక్రటరీ, ప్రిన్సిపాల్ ఫాదర్ థామస్ కిరణ్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని బాలయేసు ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో క్రిస్మస్ వేడుకలు పాఠశాల కరస్పాండెంట్ బ్రదర్ జేసురాజు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. యేసు జనన విశిష్టతను తెలిపే సాంస్కృతిక ప్రదర్శనలు తిలకించి అభినందించారు. అనంతరం కేక్ కట్‌చేసి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మదన్‌మోహన్ , మహేష్, మాధవి, అనిత పాల్గొన్నారు.

అణచివేసేందుకే అక్రమ కేసులు

- మాజీ ఎమ్మెల్యే రాజయ్య



స్టేషన్‌ఘన్‌పూర్: మాట్లాడుతున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: రాష్ట్రంలో ప్రశ్నించే గొంతుకను అణచివేసేందుకే ఫార్ములా ఈ రేస్‌లో కేటీఆర్‌పై రాష్ట్ర ప్రభుత్వం, సీఎం అక్రమ కేసులు పెడుతున్నారని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ తాటికొండ రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో సీఎం రేవంత్‌రెడ్డి తుగ్లక్ పాలన సాగిస్తున్నారని, ప్రజాస్వామ్యాన్ని దిగజార్చుతూ రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రేవంత్‌రెడ్డి ఉద్దేశ్యపూర్వకంగా కేటీఆర్‌పై కక్షసాధింపు చర్యలకు పాల్పడుతున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్నరోజుల్లో ప్రజాక్షేత్రంలో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు మాచర్ల గణేష్‌గౌడ్, నాయకులు ఆకుల కుమార్, చల్లా చందర్‌రెడ్డి, కనకం గణేష్, ఆగారెడ్డి, మునిగెల రాజు తదితరులు పాల్గొన్నారు.

అక్రమ కేసులకు భయపడేది లేదు

నర్మెట: అక్రమ కేసులకు భయపడేది లేదని బీఆర్‌ఎస్ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు చింతకింది సురేష్ అన్నారు. మండలకేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల వాగ్దానాలను తుంగలోతొక్కిన సీఎం రేవంత్‌రెడ్డిని నిలదీస్తున్నందుకే బీఆర్‌ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై అక్రమ కేసులు బనాయిస్తున్నారని అన్నారు. ప్రత్యేక తెలంగాణ సాధనకోసం ప్రాణాలు సైతం లెక్కచేయని కార్యకర్తలం కేటీఆర్‌ను అరెస్టుచేస్తే ఊరుకునేదిలేదని మరో ఉద్యమానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు. అన్నదాతలకు సంకెళ్లు వేసిన ఘనమైన కాంగ్రెస్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని అన్నారు. సమావేశంలో మాజీప్రజా ప్రతినిధులు, మాలోత్ శ్రీనివాస్, ఎండి గౌస్, నీరటి సుధాకర్, రామిని శివరాజ్, కమలాకర్‌రెడ్డి, శంకర్ నాయక్, కిరణ్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కేటీఆర్‌పై పెట్టిన కేసులు ఎత్తివేయాలి

తరిగొప్పుల: కేటీఆర్‌పై కేసులు పెట్టడం దురదృష్టకరమని, వెంటనే వాటిని ఎత్తివేయాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి అవినీతిని బయట పెడుతున్నందుకే అక్రమ కేసులు పెడుతున్నాడని విమర్శించారు. ఫార్ములా ఈ రేస్‌పై అసెంబ్లీలో చర్చ జరగాలని కేటీఆర్ బహిరంగంగా సవాల్ విసురుతుంటే సీఎం రేవంత్‌రెడ్డి ఎందుకు ముందుకు రావడంలేదని అన్నారు. చిలువేరు లింగం, అంకం రాజారాం, చెన్నూరి సంజీవ, పోషయ్య, రామరాజు, సుధీర్, మహిపాల్, జైపాల్ రెడ్డి, జుంలాల్‌నాయక్, రవీందర్, రాజయ్య, జైపాల్ పాల్గొన్నారు.

హామీలను విస్మరించిన ప్రభుత్వం

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రజలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించినదని పీఏసీఎస్ చైర్మన్ పులిగిళ్ల పూర్ణచందర్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఆయన మాట్లాడారు. ప్రజా సమస్యలపై మాట్లాడే నాయకులపై అక్రమ కేసులను పెట్టి జైలులో పెట్టే ప్రయత్నం సీఎం చేస్తున్నారని అన్నారు. ఎన్ని కేసులను పెట్టినా ప్రజలకు ఇచ్చిన హామీలను నెర వేర్చేవరకు విమర్శిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఇర్రి రమణారెడ్డి, దస్తగిరి, ఉపేందర్‌రెడ్డి, అనిల్‌రెడ్డి, అజీమ్, సిద్దిరాములు, నరేందర్, కిష్టయ్య పాల్గొన్నారు.

'విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి'

బచ్చన్నపేట: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగ సమస్యలను పరిష్కరించడంతోపాటు ఉపాధ్యాయుల పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర నాయకుడు రంజిత్‌కుమార్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వం.. ఉన్న పాఠశాలలను బాగు చేయాల్సింది పోయి ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ పేరుతో కొత్త పాఠశాలలకు శ్రీకారం చుట్టిందని అన్నారు. నాలుగు విడుతల కరువు భత్యం ప్రకటించి తక్షణమే వేతన సవరణ కమిషన్ సిఫారసులు అమలు చేయాలని కోరారు. మండల అధ్యక్షుడు కృష్ణమూర్తి, చంద్రశేఖర్‌రావు, మడూరి వెంకటేష్, కృష్ణమూర్తి, సుధాకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

'కుల జనగణనకు బీజేపే ప్రధాన అడ్డంకి'

కొడకండ్ల: దేశ వ్యాప్తంగా కుల, జన గణనకు కాంగ్రెస్ పార్టీ కృతనిశ్చయంతో ఉంటే బీజేపీ వ్యతిరేకిస్తూ ప్రధాన అడ్డంకిగా మారిందని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మసురం రవీందర్, మార్కెట్ డైరెక్టర్ దేశగాని నాగరాజులు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలో వారు విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో పార్లమెంట్‌లో సహకరించేందుకు రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ పార్టీ సిద్ధంగా ఉన్నా బీజేపీ నిర్లక్ష్యం వహిస్తుందని, బీజేపీ పార్టీ వైఖరిని మార్చుకోకుంటే రాబోవు రోజుల్లో తగిన మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని వారు అన్నారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

పాలకుర్తి టౌన్: మండల కేంద్రంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఫెయిత్ క్రైస్ట్ చర్చిలో ఐసీసీ వైసీసీ వైడబ్ల్యూ మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథిగా పాల్గొన్నా తహసీల్దార్ శ్రీనివాస్ హామాలీలు, జీపీ సిబ్బందికి దుప్పట్లు, చీరలు పంపిణీ చేశారు. అనంతరం క్రీస్తు సందేశాన్ని వినిపించారు. అనంతోజు రక్షిత ఇవాంజెలి, రాజేష్, థామస్, జాన్ పాల్ పాల్గొన్నారు.

నియామకం

తరిగొప్పుల: బీఆర్‌ఎస్ పార్టీ మండల సోషల్ మీడియా ఇన్‌చార్జ్‌గా మండలకేంద్రం జగ్గయ్యపేటకు చెందిన కొండ కుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు మండల అధ్యక్షుడు పింగిళి జగన్మోహన్ రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎండగడుతూ బీఆర్‌ఎస్ పార్టీ బలోపేతానికి కృషిచేస్తానన్నారు.

ఆర్థికసాయం అందజేత

బచ్చన్నపేట: మండలంలోని కొన్నె గ్రామానికి చెందిన మల్ల భాగ్య, సిద్దులు దంపతుల కూతురు కావ్య వివాహానికి ఆ గ్రామ సామాజిక సేవాకర్త కోడూరి శివకుమార్‌గౌడ్ రూ.5వేల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం నూతన వధూవరులను ఆశీర్వదించారు.

పద్మశాలీల ఐక్యతకు పాటుపడాలి

చిల్పూరు: పద్మశాలీల ఐక్యతకు పాటుపడాలని ఆ సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి గజ్జెల దామోదర్, మీడియా రాష్ట్ర కార్యదర్శి చింతకింది కృష్ణమూర్తి అన్నారు. చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన పేరాల రాజమౌళి శుక్రవారం మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులను వారు పరామర్శించారు.

సంక్షిప్త సమాచారం

చిల్పూరు ఆలయంలో ఏసీపీ ప్రత్యేక పూజలు



చిల్పూరు: ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం స్టేషన్‌ఘన్‌పూర్ ఏసీపీ భీంశర్మ, జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి, స్థానిక ఎస్సై సిరిపురం నవీన్‌కుమార్ చిల్పూరుగుట్ట బుగులు వేంకటేశ్వర స్వామిని దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న వారికి అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యుల వేద మంత్రాల నడుమ ఆలయ ఈఓ భాగం లక్ష్మీప్రసన్న, చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, ధర్మకర్త గనగోని రమేష్‌లు స్వాగతం పలికారు. అనంతరం ఆశీర్వచనాలు అందజేసి వేంకటేశ్వర స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

సర్పంచ్ స్థానాన్ని దళితులకు కేటాయించాలి

జఫర్‌గఢ్: సూరారం గ్రామ సర్పంచ్ స్థానాన్ని ఈ సారైనా దళితులకు కేటాయించాలని గ్రామ మాజీ వార్డు సభ్యులు కాసర్ల రాజు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే ప్రజాభవన్‌లోని ప్రజావాణిలో శుక్రవారం వినతిపత్రాన్ని అందజేశారు.

పనిచేసే వారికి బీజేపీలో సముచిత గుర్తింపు

కొడకండ్ల: పార్టీ శ్రేయస్సు కోసం అంకితభావంతో పనిచేసే నాయకులు, కార్యకర్తలకు బీజేపీలో సముచిత గుర్తింపు లభిస్తుందని పార్టీ జిల్లా నాయకుడు కర్ర శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మొండ్రాయి, రామన్నగూడెం, లక్ష్మక్కపల్లి గ్రామాల్లో బూత్ కమిటీ ఎన్నికల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. బూత్ స్థాయి నుంచి పార్టీని బలోపేతం చేసి రాబోయే స్థానిక ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం సమష్టిగా కృషి చేయాలని ఆయన కోరారు.

పాలకుర్తి: నిబద్ధతతో పనిచేసే వారికే పార్టీలో గుర్తింపు ఉంటుందని బీజేపీ మండల నాయకుడు దుబ్బ రాజశేఖర్ గౌడ్ అన్నారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పార్టీ మండల అధ్యక్షుడు దుంపలి సంపత్ ఆధ్వర్యంలో పార్టీ బూత్ కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం వారికి నియామక పత్రాలను అందజేశారు.

గుండె పోటుతో ఇద్దరి మృతి

చిల్పూరు: మండలంలో శుక్రవారం ఒకే జోరు ఇద్దరు గుండె పోటుతో మృతి చెందారు. మండలంలోని చిన్నపెండ్యాల గ్రామానికి చెందిన పేరాల రాజమౌళి (70) శుక్రవారం ఉదయం ఇంటి వద్ద పనులు చేసుకుంటూనే ఒక్కసారిగా ఛాతిలో నొప్పితో మృతి చెందాడు. అలాగే మల్కాపూర్ గ్రామానికి చెందిన అన్నం గోవర్ధన్ (45) అందరితో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలి మృతి చెందాడు.

రెండు ఇసుక ట్రాక్టర్ల సీజ్

దేవరుప్పుల: మండలంలోని గొల్లపల్లి వాగులో నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను సీజ్ చేసినట్టు ఎస్సై ఊర సృజన్‌కుమార్ తెలిపారు. యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బండకొత్తపల్లికి చెందిన ననుబాల రమేష్, యాకస్వామి అనే ఇద్దరికి చెందిన ట్రాక్టర్ల ద్వారా ఇసుక తరలించిన విషయమై కేసు నమోదు చేసినట్టు ఆయన తెలిపారు.